# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 14, ఏప్రిల్ 2026




# ఆదివాసీలు ఉన్నత స్థానాలకు ఎదగాలి

* ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి
* రోడ్డు ప్రమాదాలను నివారించాలి
* చించుఘాట్ గ్రామంలో లైబ్రరీ ప్రారంభించిన రాష్ట్ర డిజిపి
* ఆదిలాబాద్‌లో ఆదివాసులతో పోలీసులు మీకోసం కార్యక్రమం

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:



జిల్లాలోని చించు ఘాట్ గ్రామంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివాసీలతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లతో కలిసి పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసి యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షి స్తూ, పోటీ పరీక్షలకు ఉపయోగపడే సుమారు 350 పుస్తకాలతో అధునాతన లైబ్రరీని ప్రారంభించారు. డీఎస్సీ, టిటిసి, ఎస్సెస్సీ, ఆర్ఆర్బి, గ్రూప్స్ తదితర పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను లైబ్రరీలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన డిజిపి, పోలీసు అధికారులకు ఆదివాసీలు సాంప్రదాయ డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కులదైవం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డిజిపి మాట్లాడుతూ, యువత చదువుతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చెంది తమ గ్రామాలకు, జిల్లాకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. పోలీసు మీకోసం" కార్యక్రమం ద్వారా ఆదివాసీలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, వాహనం నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆదివాసీలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపబోమని తీర్మానం చేసి, ఆ ప్రతిని డిజిపికి అందజేశారు. కార్యక్రమం అనంతరం సామూహిక భోజనంలో డిజిపి పాల్గొని ఆదివాసీలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు, అదనపు ఎస్పీ పి. మోనిక, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డిఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

* ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి

బెల్లంపల్లి, ప్రభాతవార్త



పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేరుస్తున్నామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం నెన్నల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో మిట్ట రామక్క బుచ్చయ్య దంపతులు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైన రూ.5 లక్షలతో నిర్మించిన నూతన గృహానికి నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహప్రవేశం నిర్వహించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మా లక్ష్యం. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రతి అర్హుడికి సొంత ఇల్లు కల్పిస్తున్నాం అని అన్నారు. అనంతరం నెన్నల్ మండల కేంద్రంలోని 6వ వార్డులో నూతన బోర్‌వెల్ పనులకు మిగతా 2లో..



# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ అభిలాష అభినవ్

– నిర్మల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: 2లో..


# ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

* జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి

నస్పూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

జన గణనలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జన గణన తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్ళికేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఇండ్ల గణన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా మే 11వ తేదీ నుండి నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో భాగంగా ఇండ్ల జాబితా బ్లాక్ లను రూపొందించాలని, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఇండ్ల గణన, జనగణన జాబితా ప్రకారం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో దోహదపడతాయని తెలిపారు.





జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరు కాగా, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పకడ్బందీగా మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. తదుపరి నెన్నల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ.59,06,844 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. అమ్మాయిల వివాహాల సమయంలో ఆర్థిక భారం తగ్గించడమే ఈ పథకాల ముఖ్య ఉద్దేశ్యం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాల ప్రయోజనాలను పొందాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపడతామని తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్‌లలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల సమన్వయంతో ఇండ్ల గణన ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు నియమించబడిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

**నిర్మల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించకూడదని, శాఖల మధ్య సమన్వయంతో పని చేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, వసతి గృహాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బాసర అమ్మవారి ఆలయ పర్యటనను విజయవంతం చేసినందుకు, ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాణించినందుకు సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం మూడో దశ ప్రారంభమైందని, జిల్లాలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 18 నుండి 25 ఏళ్ల వయస్సు ఉండి, 10వ తరగతి నుండి పీజీ వరకు చదివిన వారు దీనికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల స్టైఫండ్‌తో పాటు బీమా సౌకర్యం కల్పిస్తారని వివరించారు. ఆసక్తి గల వారు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ తప్పాననే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

**నర్సాపూర్ (జి), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**



ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాననే మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ (జి) మండలంలో విషాదం నింపింది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లమాడ గ్రామానికి చెందిన మనివర్ధన్ (16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో తాను ఫెయిల్ అయినట్లు తెలుసుకున్న మనివర్ధన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో తన పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మృతుడి తండ్రి శివాజీ కూలీ పనులు చేస్తూ తన కూతురు, కుమారుడిని చదివిస్తున్నారు. చేతికి అందిన కొడుకు మరణించడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## దరోగపల్లిలో వైద్యశిబిరం

**పెంచికల్ పేట్, ప్రభాతవార్త :**



మండలంలోని దరోగపల్లి గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ అందజేశారు. వేసవి కాలం దృష్ట్యా ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్ణవేణి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలి

**- కలెక్టర్ కుమార్ దీపక్**

**హాజీపూర్, ఏప్రిల్ 13, ప్రభాత వార్త**

వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అరవై అలైవ్ కార్యక్రమానికి డిసిపి ఏ.భాస్కర్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల ఏ సి పి ప్రకాష్, జిల్లా రవాణా అధికారి, హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడంజరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రతనిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. రహదారి భద్రతనిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రభుత్వం సురక్షితమైన ప్రయాణం కొరకురహదారులు నిర్మించిందని, ఈ క్రమంలో రహదారులపై కేజ్ వీల్స్ నడపకూడదని, నిబంధనలు ఉల్లంఘించి రహదారులకు దెబ్బతినేలా వాహనాలు నడిపినట్లైతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయస్సు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, అనుభవానికి ప్రమాదానికి సంబంధం లేదని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా, సక్రమంగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు, కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను రవాణా చేయకూడదని, వాహనాలు నడిపే సమయంలో ఎట్టి పరిస్థితులలో మొబైల్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. గ్రామ సభలలో రహదారి భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామంలో వాహనాల వేగాన్ని నియంత్రించేలా ప్రమాద ప్రాంతాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామాలలోని అంతర్గత రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణలో భాగంగా రహదారులను శుభ్రంగా ఉంచేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రవీందర్, ఎస్. ఐ. కిరణ్ కుమార్,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులకు కరపత్రాలు పంపిణీ

**తాండూర్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**



బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఏరియా స్టోర్, వర్క్ షాప్ కార్మికులకు టీబీజీకేఎస్ హయంలో సాధించిన హక్కులకు సంబంధించిన కరపత్రాలను సోమవారం నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం, సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేనటువంటి హక్కులను టీబీజీకేఎస్ సాధించిందన్నారు. గత రెండు సంవత్సరాలుగా సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హక్కు సాధించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో పోరాడి సాధించిన తండ్రి కొడుకుల వారసత్వ ఉద్యోగాలను నిలిపివేయడం జరిగిందన్నారు. సింగరేణిలో ఒక సంవత్సరం నుంచి మెడికల్ బోర్డును నిర్వహించడం లేదన్నారు. 250 గజాల ఇంటి స్థలం ఇస్తానన్న మాట మర్చిపోయారని, కార్మికులకు పెర్క్స్ పైన పడుతున్న ఇన్కమ్ టాక్స్ డబ్బులను తిరిగి ఇస్తామని, తదితర మేనిఫెస్టోలో పేర్కొన్న 45 హామీలను ఇచ్చి మర్చిపోయారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, ఏరియా నాయకులు రమేష్, వెంకటేష్, పిట్ కార్యదర్శి గణపతి, ఏరియా వర్క్ షాప్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి టేకులబస్తిలో రోడ్డు భద్రతపై ప్రజల ప్రతిజ్ఞ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని 15వ వార్డు టేకుల బస్తి కౌన్సిలర్ చింతల వసంత పిలుపునిచ్చారు. సోమవారం రోజున బెల్లంపల్లి టేకుల బస్తిలో రోడ్డు భద్రతపై బెల్లంపల్లి వన్ టౌన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ కంపెల జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వసంత మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం సూచించిన భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మరణాలు, గాయాలు, అంగవైకల్యాలను తగ్గించడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు. భారతదేశ పౌరులుగా మోటారు వాహన చట్టంలో ఉన్న నిబంధనలను కచ్చితంగా పాటిస్తామని ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆడెపు పద్మ, ఆశా కార్యకర్త సుజాత, ఆయమ్మ కమల, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్, కాంగ్రెస్ నాయకులు కసిపాక రాజరత్నం, ఎండీ గౌస్, బొల్లి వంశీకృష్ణ, ఎస్.కే సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత

**- గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై అరైవ్ అలైవ్ కార్యక్రమం**

**వేమనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. వేమనపల్లి మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ ల అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 13 నుంచి వారం రోజులు జరిగే ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే ప్రధాన లక్ష్యమని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. నీల్వాయి గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, ముఖ్య అతిథిగా ఎంపిడిఓ కుమారస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్, ఓవర్ టేకింగ్ వంటివి చేయకూడదని నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో యువత ఎక్కువ ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని గ్రామాలలో మైనర్లు వాహనాలు నడపకుండా చూడాలని గ్రామస్తులకు నిరంతరం ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించాలని కోరారు. అనంతరం సభకు హాజరైన వారందరితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. నేను ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించను, హెల్మెట్ ధరిస్తాను ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించను అంటూ గ్రామస్తులు శబదం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, పోలీస్ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తాండూర్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**తాండూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**



మండలంలోని తాండూర్, రేచిని, రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీలలో సోమవారం సాయంత్రం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పర్యటించారు. తాండూర్ లో షాదిఖానా భవనం, రేచినిలో గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రాజీవ్ నగర్ లో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు ముడిమడుగుల సురేష్, పోతురాజుల రాంబాయి, మామిడాల లలిత, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ. 2,400 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులందరూ మార్కెట్ యార్డులోనే తమ పంటను విక్రయించుకోవాలని, దళారుల వద్దకు వెళ్లి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, పీఏసీఎస్ సీఈవో మల్లేష్, మండల బీజేపీ అధ్యక్షుడు నరేష్, నాయకులు, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## విజేత పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్


ఖానాపూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

విద్యార్థులు చదువుతో పాటు మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ముందుకు సాగాలని విజేత పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఆవిష్కరణలు, ప్రయోగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక మార్పులకు అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారించి, సమాజానికి ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోవింద్‌పూర్ గ్రామ సమస్యలను తెలుసుకున్న ఆడే గజేందర్

నేరడిగొండ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

నేరడిగొండ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామస్తుల ఆహ్వానం మేరకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సోమవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఊరికి నాయకులెవరూ రారని, అడిగిన వెంటనే స్పందించి వచ్చినందుకు గ్రామస్తులు ఈ సందర్భంగా ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని, ఒక్కొక్కటిగా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# రిజర్వు ఫారెస్ట్ నుంచి రెవెన్యూ గ్రామంగా మార్చాలి

### - కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన మాజీ జడ్పీటీసీ, గ్రామస్తులు

వేమనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

తమ గ్రామాన్ని రిజర్వు ఫారెస్ట్ నుండి తొలగించి రెవిన్యూ గ్రామంగా మార్చాలని సుంపుటం గ్రామస్థులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని కలిసి వినతి పత్రం అందజేసారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్ కు మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి వినతి పత్రం అందజేశారు. 1978 సంవత్సరంలో సుంపుటం గ్రామం ప్రాణహిత నది ఒడ్డు నుండి ఇప్పుడు ఉన్న చోటుకు తరిలి వచ్చి శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకొని 48 సంవత్సరాల నుండి నివశిస్తున్నామని ఆ గ్రామానికి ప్రభుత్వం తరుపున మంజూరైనా సిమెంట్ రొడ్లు, పాఠశాల, అంగన్వాడి, గ్రామపంచాయితీ భవనాలు, వాటర్ ట్యాంక్ మొదలైన అన్ని నిర్మాణాలు చేపట్టి ప్రజలు వినియోగిస్తున్నారు కానీ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మా గ్రామానికి 15 ఇండ్లు మంజూరయ్యాయి. వాటిని నిర్మాణాలు చేపట్టి పునాది స్థాయి బిల్లులు కూడా తీసుకున్నామనీ ఇప్పుడు గోడలు నిర్మించే స్థాయిలో ఉండగా ఫారెస్ట్ అధికారులు వచ్చి ఇది రిజర్వ్ ఫారెస్ట్ భూమని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిపివేశారు. కావున సుంపుటం గ్రామాన్ని రిజర్వ్ ఫారెస్ట్ నుండి తొలగించి రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, సుంపుటం సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, ఉప సర్పంచ్ దందేర మహేష్, మాజీ సర్పంచ్ కుబిడే కిష్టయ్య, నాయకులు దుర్గం తిరుపతి, శీలం సంజీవ్, లంగారి దేవేందర్, చప్పిడి శంకర్, బద్ధి మల్లేష్, కుబిడే గణపతి, బెడ్డల ముసలయ్యలు పాల్గొన్నారు.




## రోడ్డు నియమాలు పాటిద్దాం - ప్రమాదాలను నివారిద్దాం

### - జన్నారం ఎస్ఐజి.ఉదయ్ కిరణ్

జన్నారం,ఏప్రిల్ 13, ప్రభాతవార్త

రోడ్డు నియమాలు పాటిద్దాం ప్రమాదాలను నివారిద్దాం అని జన్నారం ఎస్సై జి.ఉదయ్ కిరణ్ అన్నారు.వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జన్నారం ఎస్సై గుర్రపు ఉదయ్ కిరణ్ సూచించారు. జన్నారం పట్టణంలోసోమవారం రోజున ఆయన పలువురు వాహనదారులకు ఆరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ఓవర్‌టేక్ చేయరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వాహనదారులు,పోలీసులు ఉన్నారు.



## భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

జన్నారం,ఏప్రిల్ 13, ప్రభాతవార్త

తమ భూమిని కబ్జా చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ యజమాని అనుముల వేణుమాధవ్ ఫిర్యాదు చేశారు. సోమవారం రోజు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పొనకల్ శివారులోని సర్వేనెంబర్ 363లోని మా యొక్క స్వంత పట్టా కలిగిన భూమిలోకి పక్కన గల సర్వే నెంబర్ 358లో పట్టా కలిగిన వ్యక్తులు మా సర్వే నెంబర్ లోని భూమిని కబ్జా చేసి వారి భూమితో పాటు మా భూమిని కూడా చదును చేసి మొరం పోశారని తెలిపారు. రెండు సర్వే నెంబరుల మధ్య హద్దుల నునిర్ణయించాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఈ విషయంపై పొనకల్ ఈవో రాహుల్ కు కూడా తమ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలంటూ ఫిర్యాదు చేశారు.



## రోడ్డు నిబంధనలు పాటించాలి: భైంసా రూరల్ ఎస్సై సుప్రియ

భైంసా రూరల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని భైంసా రూరల్ ఎస్సై సుప్రియ కోరారు. మండలంలోని దేగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, దేగాం గ్రామ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ, గ్రామంలో ప్రత్యేకంగా ఖిరోడ్డు ప్రమాదాల నివారణ కమిటీఖిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కారాగిరి భోజన్న, వార్డు సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలి

### - ఎమ్మెల్యేకు వినతి పత్రం

భైంసా, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:

గొల్లమాడ, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇప్పటికే కొన్ని చోట్ల కేంద్రాలు ప్రారంభమయ్యాయని, అవసరమైన ప్రతి చోటా కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులకు, సంబంధిత మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం జాప్యం చేస్తే రైతుల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తిమ్మాపూర్ సర్పంచ్ రాజేందర్, గొల్లమాడ మాజీ సర్పంచ్ చిన్న మహేష్, నాయకులు వినోద్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ గ్రామాల గ్రామస్థులు

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ - బాధితుల నుంచి వినతుల స్వీకరణ.. క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశం**

**నస్పూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత కార్యాలయాల భవనంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 60 దరఖాస్తులు రాగా వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా భూ వివాదాలు, రికార్డుల సవరణ, ఇళ్ల పట్టాల కోసం ప్రజలు వినతులు సమర్పించారు. కన్నెపల్లి, లక్షెట్టిపేట, కాజీపేట మండలాల నుండి వచ్చిన బాధితులు తమ భూములకు సంబంధించిన సమస్యలను వివరించారు. చెన్నూర్ మండల కేంద్రానికి చెందిన ఓ దివ్యాంగురాలు ఇళ్ల స్థలం కేటాయించాలని కోరారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డ్ కబ్జాపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని విన్నవించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు సమన్వయంతో విచారించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





మొక్కజొన్న కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## రైతులు ఆందోళన చెందవద్దు: ఎమ్మెల్యే

**భైంసా, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని, నియోజకవర్గంలోని రైతాంగానికి సరిపడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. సోమవారం భైంసా పట్టణంలోని ఏఎంసీ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఇతర నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభమయ్యాయని, అవసరమైన ప్రతి చోటా కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారులకు, సంబంధిత మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాలనే ఆశ్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు రావుల రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ బాజనోల్ల గంగాధర్, జడ్పీటీసీ సప్లి రమేష్, కౌన్సిలర్లు చర్ల సుభాష్, చింతపండు మహేష్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**చెన్నూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సజిత జగన్మోహన్ రావ్ మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున వివిధ పనుల కోసం గ్రామానికి వస్తున్న పాదచారులను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ముత్యాల సాయి, పంచాయతీ కార్యదర్శి హరిత, వార్డు సభ్యులు నస్కూరి శ్రీనివాస్, ఇంగిలి పద్మ, కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు బెల్లంకొండ కరుణసాగర్ రావ్, మండలాధ్యక్షుడు ముత్యాల బాపు గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మికులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి: ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి

**- ఐకే ఓసీపీలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ**

**నస్పూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

సింగరేణి వ్యాప్తంగా ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల రక్షణ కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లో సోమవారం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీని ప్రారంభించారు. ఐకే గ్రూప్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి మొదటి షిఫ్ట్ ఉద్యోగులకు బటర్ మిల్క్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోల్ బెల్టులో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున విధులకు వచ్చే సమయంలో మరియు వెళ్లే సమయంలో ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఏవీ రెడ్డి కోరారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు పండ్ల రసాలు, మజ్జిగ, ఇతర చలవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని హితవు పలికారు. యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ (ఆపరేషన్) జి. శంకర్, వివిధ విభాగాల అధికారులు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



## కౌట్ల (బి)లో పోషణ పక్వాడా కార్యక్రమం

**సారంగాపూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్వైజర్ భారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం పోషణ అభియాన్ పథకంలో భాగంగా ప్రతి ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన భారతావనిని అందించడమే లక్ష్యంగా అంగన్వాడీల ద్వారా ఈ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థానిక ఆహార అలవాట్లపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్గూరి అజయ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, అంగన్వాడీ టీచర్లు కె. రాధ, అన్నపూర్ణ, జ్యోతి, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మెరిసిన విద్యార్థులు

**వేమనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలలో వేమనపల్లి మండలం నుంచి పాల్గొని జడగల్ల అంజలి హై జంప్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్, కుర్రు శ్రీవాణి లాంగ్ జంప్‌లో ఆరో స్థానం సాధించిందని వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి మల్లేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11,12 జవహర్లాల్ నెహ్రూ స్టేడియం హన్మకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయం సాధించారని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులను ఎంపీడీవో కుమారస్వామి, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు చెన్నూర్ సమ్మయ్య ఆధ్వర్యంలో ప్రశంసించి సన్మానం చేసి అభినందించారు.



ఐకే ఓసీపీలో కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి

# హిజ్రాల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

మండలంలోని చింతల్ చాంద గ్రామంలో హిజ్రాల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగట్ల రాజన్న ఆదివారం తన నూతన గృహ ప్రవేశం చేశారు. సాయంత్రం సమయంలో నిర్మల్‌కు చెందిన నలుగురు హిజ్రాలు ఆటోలో వచ్చి, రూ. 11 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత స్తోమత లేదని, రూ. 3 వేలు ఇస్తామని రాజన్న కుటుంబ సభ్యులు చెప్పడంతో ఆగ్రహానికి గురైన హిజ్రాలు బూతులు తిడుతూ రాజన్నపై దాడి చేశారు. అనంతరం ఆయన్ని బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని కొంతదూరం వెళ్ళాక కిందకు నెట్టివేశారు. ఈ క్రమంలో ఆటో టైర్లు రాజన్న రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది. బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అకారణంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న క్రీడాకారిణి



హిజ్రాల దాడిలో గాయపడిన రాజన్న

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

**- తొమ్మిది మంది పేకాట రాయుళ్లు అరెస్ట్ - నిందితుల వద్ద నుంచి రూ. 9500 నగదుతో పాటు ఆరు చరవాణిలు స్వాధీనం**

**- చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరిక**

**చెన్నూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**



చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ చాకలి వాడలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సైలు సుబ్బారావు, శ్యాం పటేల్, సిబ్బంది తో కలిసి రైడ్ చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన నిందితులను విచారించగా నిందితుల్లో అయిటిపాముల ప్రశాంత్, పెదకొండ నరేష్, ముత్తన్నపల్లి సాగర్, పెదకొండ మహేష్, ఐటీపాముల శంకర్, అడ్డరి ప్రేంకుమార్, చిప్పకుర్తి రమేష్, తగరం సంతోష్, ఎండీ. నిజాముద్దీన్ పట్టుబడగా మరొక వ్యక్తి తగరం మహేందర్ పారాయిపోయినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9500 నగదుతో పాటు ఆరు మొబైల్ ఫోన్స్ సీజ్ చేసి వారిని పోలీస్ స్టేషన్ తరలించామన్నారు. పారిపోయిన వ్యక్తి తో కలిపి 10 మంది పై కేసు నమోదు చేసి 9 మందిని అరెస్టు చేశామన్నారు. చెన్నూర్ పట్టణంలో గానీ గ్రామాల్లో గానీ ఎవరైనా పేకాట ఆడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొనబడుతాయని, రెండుసార్లు పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిపై రౌడీ షీట్ తెరువబడుతుంది పేర్కొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**నిర్మల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. మొక్కజొన్నకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 2,400 కనీస మద్దతు ధర నిర్ణయించిందని, రైతులు తమ పంటను ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల రైతులు ఇప్పటికే నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నాణ్యతతో సంబంధం లేకుండా అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**ఖానాపూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తోందని తెలిపారు. కడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బూత్ లెవల్ మండల ఇంచార్జ్‌లు బి. పోతన్న యాదవ్, ముడుసు సత్యనారాయణ, రామ్ రెడ్డి మాట్లాడారు. పీసీసీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో కృషి చేయాలని సూచించారు. త్వరలోనే గ్రామ కమిటీల నియామకాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగేల భూషణ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొద్దుటూరి సతీష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బుర్ర దేవందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ముడికే మల్లేష్ యాదవ్, రెంకల శ్రీనివాస్ యాదవ్, నాయకులు బొద్దు గంగన్న, రమేష్, రఫిక్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## నచ్చన్ ఎల్లాపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

**ఖానాపూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ బొద్దు స్పందన గంగన్న ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తుందని పేర్కొన్నారు. యువత నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామ కార్యదర్శి శాంత మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు చైతన్యంతో వ్యవహరిస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏ కమలాకర్, ఉపసర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు అంబాజీ, లక్ష్మి, కారోబార్ మహేందర్, ఉపాధ్యాయురాలు రాజసుధ, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, ఆశా వర్కర్ గోదావరి, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బొద్దు స్పందన గంగన్న




## కోలాం ఆదివాసీ గ్రామాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా**

**ఉట్నూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

కోలాం ఆదివాసీ గ్రామాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీలతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్, బేల మండలాల పరిధిలోని పలు కోలాం గ్రామాల్లో ప్రజలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోడు భూములకు హక్కు పత్రాలు, ఇందిరమ్మ ఇండ్లు, అంత్యోదయ రేషన్ కార్డులు, తాగునీటి సౌకర్యం తక్షణమే కల్పించాలని కోరారు.అదేవిధంగా సాగునీరు, ఉపాధి అవకాశాలు, పింఛన్లు, రోడ్డు వంటి మౌలిక వసతులు కల్పించాలని, అటవీ శాఖ అధికారుల వేధింపులు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లంకా రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణలో దుమ్ము ధూళి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

రోడ్డు విస్తరణ పనుల సందర్భంగా దుమ్ము ధూళి నుండి ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ కోరారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సర్పంచ్ జాదవ్ అనిత శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం అభినందనీయమని, అయితే పనుల వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఉట్నూర్ పాత బస్టాండ్ నుండి ఐబి వరకు జరుగుతున్న పనుల కారణంగా దుమ్ము, ధూళి, రాళ్లు ఎగురుతూ వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.కావున రోజుకు మూడు సార్లు నీటి ట్యాంకర్ల ద్వారా రోడ్డుపై నీరు చల్లి దుమ్ము నియంత్రించాలని, పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షౌకత్ అలీ, సాయి, యువజన నాయకులు సడిగే రాజ్‌కుమార్, బొద్దు నరేష్, పొన్నం సాయి కుమార్, పటేల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## 16న మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, జిల్లా ఉపాధి శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో వివిధ ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు తగిన ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన, చదువుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు ప్రతులు వెంట తీసుకురావలని తెలిపారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సిసి రోడ్డు నిర్మాణం

**- ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు అందజేత**

**వేమనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:**

నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వేస్తున్నారని స్వేచ్ఛ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో కుమారస్వామికి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ యువజన సంఘం అధ్యక్షులు గురుండ్ల సురేష్ మాట్లాడుతూ గొర్లపల్లి గ్రామ పంచాయతీలో సీసీ రోడ్డు తొలగించకుండా, పాత రోడ్డుపైనేే రోడ్డు వేస్తున్నారని నాణ్యమైన ఇసుక వాడటం లేదని ఇసుకలో మట్టి కలిసి ఉందని నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులకు ఫోటోలు పంపించడం జరిగిందని స్పందించలేదని పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం ఉందన్నారు. అలాగే క్యాతనపల్లిలో రోడ్డు వేయకుండా బిల్స్ లేపడం గొర్లపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాల పైన చర్యలు తీసుకోవాలని ఇట్టి ఫిర్యాదులో కోరారు. ఏఈ పైన ఉన్నత అధికారులు స్పందించి విధుల నుండి తొలగించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తమన్నారు. ఈ కార్యక్రమంలో స్వేచ్ఛ యువజన సంఘం నాయకులు అరిగెల మహేష్, నికూరి శంకరయ్య, నేదునూరి సంజీవ్, చటారి తిరుపతి పాల్గొన్నారు.




వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చిన ప్రతి ధరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డెవిడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్జిదారుల నుండి స్వీకరించిన ధరఖాస్తులపై ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను పరిశీలిస్తే.... ఆసిఫాబాద్ మున్సిపాలిటిలోని నూర్ నగర్ కు చెందిన సాజిదాబెగం తనకు ఇందిరమ్మ ఇల్లు మంజురు చేయాలని, కెరమెరి మండలం ముఖద్దం గుడా గ్రామానికి చెందిన రాథోడ్ మనిషా తను గత సర్పంచ్ ఎన్నికలలో పోటి చేసిన పత్రాలు అందించాలని, ఆసిఫాబాద్ మండలం సాలేగుడా గ్రామానికి చెందిన ముంజం బాగుబాయి తనకు అనువంశకంగా వస్తున్న భూమిని ఇతరులు దౌర్జన్యంగా కబ్జా చేసారని విచారణ జరిపి చర్యలు తీసుకొవాలని, కెరమెరి మండలం మహారాజ్ గూడా గ్రామానికి చెందిన రాథోడ్ విజయ్ తన గ్రామంలో గతంలో వున్న సిసి రోడ్డు భాగున్నా దానిపై మళ్ళి సిసి రోడ్డు వేస్తున్నందున చర్యలు తీసుకొవాలని, వాంకిడి మండల కేంద్రానికి చెందిన సంధ్యారాణి తనకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి చేయాలని, ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన దుర్గం హక్కు తనకు చెందిన వ్యవసాయ భూమిలో బోరుబావి మంజూరి చేయాలని పలువురు ధరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమములో అర్జిదారులు, అధికారులు పాల్గొన్నారు.


దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఎం.డెవిడ్



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ ఆనందరావు పంచాయతీ సిబ్బంది .సభ్యులు

## రోడ్డు భద్రత పై ప్రత్యేక గ్రామసభ

**కెరమెరి ఏప్రిల్ 13 ప్రభాతవార్త :**

రోడ్డు భద్రతపై సోమవారం కెరమెరి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో రోడ్డు ప్రమాదల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు మలుపు, ప్రధాన విధుల్లో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు, రక్షణ చర్యలు చేపట్టుటకు తీర్మాణాలు చేసి ప్రతిపాదనలు పంపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ స్థాయి రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, జీపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**తాండూర్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తాండూర్ ఎస్సై ప్రసాద్ అన్నారు. అచ్చులాపూర్‌జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, 18 సంవత్సరాల లోపు పిల్లలకి వాహనాలు ఇవ్వరాదని, జీవితం చాలా విలువైనదని రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణం చేయాలని కోరారు. ఈనెల 13 నుంచి 18 వరకు రోడ్డు భద్రత వారోత్సవాలు కొనసాగుతాయన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, మాజీ జడ్పీటీసీ బండి పోశం, ఏఎస్ఐ మీర్ ఉస్మాన్ అలీ, హెచ్ఎం, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

**తాండూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మాదారం ఎస్ఐ సౌజన్య అన్నారు. మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సౌజన్య మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించి ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపించకూడదన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అడ్డదారుల్లో ప్రయాణించి ఎదుటి వాహనాలకు ఇబ్బంది కలిగించకూడదని సూచించారు..గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ఎస్సై సౌజన్యను శాలువాతో సన్మానించారు. అనంతరం పంచాయతీ సెక్రెటరీ అల్లావుద్దీన్ రోడ్డు భద్రతకు సంబంధించి గ్రామ కమిటీని నిర్ణయించి, వారి పేర్లను గ్రామ ప్రజలకు వివరించారు. రోడ్డు భద్రత విధులలో భాగంగా ప్రజలకు, పోలీసులకు మధ్య కమిటీ సభ్యులు వారధిగా పని చేస్తారని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు మెబర్లు, బానేష్, మీసా లలిత,సౌమ్య, రవికుమార్, నాయకులు శ్రీనివాస్, రమేష్, క్రిష్ణ, రామచందర్ అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.



## జనాభా లెక్కల గణన పట్ల అవగాహన సమావేశం

**వేమనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**


వేమనపల్లి మండలానికి సంబంధించిన జనాభా లెక్కల గణనను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని తహసీల్దార్ సాయిబాబు అన్నారు. సోమవారం 2026లో ఫేస్ వన్ నిర్వహించే జనాభా లెక్కల గణన ప్రణాళిక కోసం ముందస్తుగా అవగాహన సమావేశం ఎంపిడిఓ కుమారస్వామి, తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జనాభా లెక్కల గణన చేసే విధానం, ఆయా గ్రామాలను బ్లాకులుగా విభజించి జనాభా గణన చేసే విధానం గురించి కార్యదర్శులకు, జీపీవోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిఎస్ఓ సుమన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల ఎంపిఎస్ఓ

## అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఎల్కపల్లి గ్రామములోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి, భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ భక్తు రాంచంధర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ రాంచందర్, నాయకులు

## నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**



ఆసిఫాబాద్ సర్కిల్ పరిధిలోని వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ఆ శాఖ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తున్నారన్నారు. 202526 సంవత్సరంలో విద్యుత్ సరఫరా వ్యవస్థలో గణనీయమైన మెరుగుదల కనిపించిందన్నారు. ఈ ఏడాదిలో ఓవర్‌లోడ్ సమస్యలను నివారించేందుకు 751డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్తగా ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని తెలిపారు. విద్యుత్ శాఖ మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేస్తున్నారని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను సమీప సెక్షన్ కార్యాలయంలో తెలియజేయాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని సూచించారు.

## పదవతరగతి విద్యార్థులకు అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పోతేపల్లి సర్పంచ్ దుర్గం పోషన్న ఆధ్వర్యంలో సోమవారం అరటిపండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అలసిపోకుండా ఎండనుండి ఉపశమనం పొందేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య, నాయకులు వెంకటాచలం, మహేష్, గోపాల్, శ్రీకాంత్, తిరుపతి, రాజన్న, శంకర్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


అరటిపండ్లు, మజ్జిగ అందజేస్తున్న సర్పంచ్ పోషన్న

# వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :**

వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం బూరుగుడ గ్రామంలో నాలుగో విడత అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగ పరిమితిని పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని, కుటుంబాల భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత పాటిస్తామని ప్రజలు, పోలీస్ అధికారులు ప్రతిజ్ఞ చేశారు. పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్, గ్రామ ప్రజలు, సర్పంచ్ సంగీత, గ్రామ పాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





తిర్యానిలో అంగన్ వాడి భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

## తిర్యానిలో ఆకస్మికంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

**తిర్యాని, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలో సోమవారం జిల్లా కలెక్టర్ హరిత నీతి ఆయోగ్ ప్రత్యేక అధికారి రంజిత్ కుమార్ తో కలిసి ఆకస్మికంగా పర్యటించారు. నీతి ఆయోగ్ కార్యక్రమాల అమలులో భాగంగా మండలంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. రాంబాయిగూడాలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడి పిల్లల హాజరు, పౌష్టికాహారం పంపిణీ, రికార్డుల నిర్వహణ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో నీతి ఆయోగ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, నాణ్యతపై కలెక్టర్ ఆరా తీశారు. అధికారులకు పనులు సకాలంలో పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని సూచించినట్లు సమాచారం. కలెక్టర్ వెంట మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సత్కరిస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ నూతన సభ్యులు

## మంచిర్యాల ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**- నూతన కమిటీకి ప్రేమ్ సాగర్ రావు శుభాకాంక్షలు..**

**- గజమాలతో ఎమ్మెల్యేకు సత్కారం**

**నస్పూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సోమవారం స్థానిక శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కొత్త సత్తయ్య, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్తయ్య తమ బృందంతో కలిసి ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కమిటీ సభ్యులందరికీ ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## జజ్జరెల్లిలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

కన్నెపల్లి మండలంలోని జజ్జరెల్లి గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అధికారులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది అని తెలిపారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో తోడ్పడుతుందని, సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను పాటిస్తూ నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జజ్జరెల్లి గ్రామపంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్‌తో పాటు ఆరుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, అవకాశాలు కల్పిస్తాం అని తెలిపారు. మరింత మంది ప్రజలు అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సృజన నర్సింగరావు, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తిర్యాని వైద్యుల పనితీరు భేష్

**- నీతి ఆయోగ్ ప్రత్యేక అధికారి రంజిత్ కుమార్ ప్రశంస**

**తిర్యాని, ప్రభాతవార్త, ఏప్రిల్ 13:**

తిర్యాని మండల పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ హరితతో కలిసి నీతి ఆయోగ్ ప్రత్యేక అధికారి రంజిత్ కుమార్ తిర్యాని ప్రభుత్వ వైద్యశాలను సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి ప్రత్యేకంగా అభినందించారు. తనిఖీ సందర్భంగా అధికారులు ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలు, వైద్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మండలంలో గర్భిణులకు డెలివరీలు గ్రామాల్లో జరుగుతున్నాయా లేక ఆసుపత్రిలో జరుగుతున్నాయా అని ప్రత్యేక అధికారి ప్రశ్నించగా అన్ని డెలివరీలు ఆసుపత్రిలోనే జరుగుతున్నాయని డాక్టర్లు సమాధానం ఇచ్చారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన రంజిత్ కుమార్, సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహిస్తున్న డాక్టర్ల బృందాన్ని అభినందించారు. పనితీరు బాగుంది, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ సీతారాం, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్, వైద్యాధికారులు కృష్ణ, అక్షయ్, పల్లవి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫీల్డ్ అసిస్టెంట్లకు సన్మానం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జిల్లాలో అత్యధికంగా కూలీల సమీకరణ చేపట్టి, లక్ష్య సాధనలో విశేష కృషి చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా కలెక్టర్ కె. హరిత ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ఫీల్డ్ అసిస్టెంట్లను శాలువాతో ఘనంగా సత్కరించి, వారికి జ్ఞాపికలతో పాటు నగదును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర అత్యంత కీలకమని, జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, క్షేత్రస్థాయిలో కూలీల సమీకరణను ఇంకా ముమ్మరం చేయాలన్నారు. ప్రస్తుతం సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే రాబోయే రోజుల్లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు రావు, తిర్యాణి ఎంపీడీఓ మల్లేష్, ఏపీఓ లతో పాటు సంబంధిత మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మంచిర్యాలలో అరైవ్ అలైవ్ పోస్టర్ల ఆవిష్కరణ

**నస్పూర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సోమవారం జిల్లా ఆర్టీఓ కార్యాలయ ఆధ్వర్యంలో రూపొందించిన అరైవ్అలైవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రణాళికను రూపొందించారు. రహదారి నిబంధనలపై వాహనదారుల్లో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రవాణా శాఖ తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు అంకతి శ్రీనివాస్, ఎంవీఐలు రంజిత్ రెడ్డి, కిషోర్ చంద్ర రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

